

# ప్రేమలేఖ

శ్రీ "వాసు"

సుధా!

చలిగాలి రివ్వున వేస్తున్నది. నా గదిలో టేబిల్ లైటు భగ్గుమంటున్నది.

చొక్కా జేబులో పెట్టుకొన్న నీ ఉత్తరం తీశాను. ఎన్నిసార్లు చదివేనో లెఖ్ఖలేదు. కాలేజీకి కూడా ఉత్తరం పట్టుకెళ్ళాను. క్లాసుపుస్తకాలు కూడా ఇన్నిసార్లు చదవలేదు. నీ ఉత్తరంలో కవిత్వం వున్నదో, ఏమోగాని గీతాపారాయణ చేశాను.

నీకు ఉత్తరం వ్రాయడానికి కూర్చునేసరికి పోస్టు జవాను నీ ఉత్తరం పట్టుకొచ్చాడు. బ్రహ్మ జెముడుకు నిప్పు అంటుకున్నప్పుడు వర్షపాతం సంభవిస్తే, ఆ అగ్ని చల్లారుతుందని కవిశిరోమణి చెప్పాడు. దుఃఖంతో కరుడు కట్టిన నా హృదయానికి, వేదనాగ్నితో వేగుతున్న నా హృదయానికి నీ ప్రేమలేఖ చల్లని వర్షపు జల్లులా వున్నది. ఈ మ్రోడువారిన హృదయానికి ఆనందానుభూతి కల్గింది.

అబ్బా! నాకు పెద్దఉత్తరం రాయవూ? మనం ఇలా ఉత్తరాలు రాసుకొంటూవుంటే మీవాళ్లు నీమీద అనుమానిస్తున్నారా? లెక్షచెయ్యకు. నీ వుత్తరం రాకపోతే నాకు మెదడు బొత్తిగా పనిచెయ్యదు.

నీ సుధాచుంబనం తల్చుకొంటే వొళ్ళు కాకరకాయలా పునీతమవుతున్నది. నువ్వు కోరికిన తమలపాకు ఈనె, ఒక లవంగంమొగ్గ కవరులో పెట్టి పంపు మరచిపోకు.

అబ్బా భరించలేకుండా వున్నాను. ఊరిచివర ఒక గది తీసుకుని ఒక్కణ్ణే వుంటున్నాను. వూళ్ళోకి వెళ్ళడంలేదు. మతిపోయినట్టు వున్నది.

నీదగ్గిర కూర్చుని ఖబుర్లు చెప్పేదాకా నామనస్సు మనస్సుగా వుండదు.

పక్కమీద అర్ధచంద్రాకారంగా ఒకపక్క పడుకొని నీ ఫొటో తనివితీరా చూసుకొన్నాను. జలజల రాలిన కన్నీటితో నీబొమ్మ తడిసిపోయింది. తలగడాలో ముఖం పెట్టుకొని, విచారిస్తూ కలతనిద్ర పోయాను.

కాలేజీ 'టైము' దాటిపోయింది, హోటలువేళ దాటిపోయింది.

మళ్ళీ మూడుగంటలు వేళాక లేచి కూర్చొని

కిటికీలోంచి ఎండిపోయిన శూన్యమైన బీడుభూమిచూస్తూ కూర్చొన్నాను.

*  *  *

రావణున్ని హతమార్చి, సీతారాములు విమానం ఎక్కి అయోధ్యకు ప్రయాణం చేస్తూవుంటారు. కంటికి కనపడే రమ్యమైన దృశ్యాలను వర్ణించి చెబుతున్నాడు.

రాముడు తన ప్రేయసికి తను వెనక ప్రవాసిగా వున్నప్పుడు అనుభవించిన విప్రలంభావస్థ ఆమెకు చెబుతున్నాడు.

"వతద్గిరేర్మాల్యవతః పురస్తాత్
ఆవిర్భవత్యంబరలేఖి శృంగం
నవం పయో యత్ర ఘనైర్మయాచ
త్వద్విప్రయోగాశ్రుసమం విసృష్టమ్,"
"గంధశ్చ ధారాహత పల్వలానాం
కాదంబ మర్ధోద్గత కేసరంచ
స్నిగ్ధాశ్చ కేకాః శిఖినాం బభూవుః"
యస్మిన్నసహ్యాని వినా త్వయా మే!

మాల్యవంతమనే కొండ ఆకాశాన్ని తగులుతూ వుంది. మేఘాల తాకిడికి కొత్త వాన చినుకులు పడ్డాయి. పాపం రాముడికికూడా ప్రియురాలి ఎడబాటువల్ల, ప్రవాస వేదనవల్ల కన్నీరు వర్షించింది. శిఖరం పైనుంచి జడివాన వల్ల వర్షధారలు, సగం పైకి వచ్చిన, చిన్న రేకులున్న కడిమిపువ్వుల వాసన, నెమిళ్ళ స్వరాలు అన్నీ రమ్యంగా వున్నా నేను సహించలేకపోయాను. అన్నాడు.

"పంచవటిలో గోదావరి వడ్డున వేటనుండి మరలి వచ్చి, తరగలమీద గాలిచే ఆయాసము పరితాపము పోగొట్టుకొనబడి విస్రంభంలో నీ తొడమీద తల వుంచు కొని ప్రబ్బలి పొదరిళ్ళలో పరుండడము తలుస్తున్నాను."

ఈ ఘట్టాలు చదువుతుంటే అబ్బ నా అనుభవాలు ఎంత చక్కగా సరిపోయినై!

నీ ఉత్తరంకోసం ఎదురుచూచాను వారంరోజుల క్రితం. కళ్ళు కాయలు కాచినై.

పోస్టు జవానుమీద వెర్రికోపం వచ్చింది.

పోస్టు ఆఫీసుకు తిరగలేకపోతున్నా.

నీకు నేను రాసే వుత్తరాలు మీవాళ్ళకు కనపడనియ్యకు.

మీవూరు వచ్చినపుడుగాని నామనస్సు శాంతించదు. అంతవరకూ ఇలా వేగిపోతూవుంటాను. అకస్మాత్తుగా పండువెన్నెల్లోంచి దట్టమైన కన్నుపొడుచుకున్నా కనపడని చీకట్లో పడిపోయాను.

ఉత్తరం మరచిపోకు.

"సౌందర్య ముకురమో సఖియ! నీబుగ్గ
గొనకున్న నాముద్దు గురుతెట్లుపోదు.
నీ ప్రేమ వార్ధిలో నెగయు కల్లోలాన
మురియు వెన్నెలముద్దు దరియు నీలిమసీడ
గదలని యణువునే సొదలలో బుడగనే
కావి చెంగల్వనే కలకలామెరుపునే;

దరియు చంద్రికలె నీ
తరుణంపు హస్తాలు
అందమే సుడిగాలియై
రివ్వునను నెగయు
హాయిగా నల్లల్లనాడెడి
గులాబివే!"

ఈ 'నీలిరత్నాలు' కాన్క పంపుతున్నా.

వుండనా
నీ

